# శరణార్థిని

భళ్ళముడి సీతారామమూర్తి



## <u>కవి మనవి</u>

రసిక హృదయ ప్రసన్నాను రాగరేఖ
నిస్త మః ప్రక్రియాద్యుతి విసృతి గన
అంతరంగమ్మునసిలిచి యాడుహాయి
నా కృతి కుమారి మీ దీవనలను వలిచి

కృతిసమర్పణ

ప్రదిత వేంకట సూర్యనారాయణాఖ్యు
జనకుఁ గామేశ్వరమ్మను జననిఁ బూజ
చేయు కోర్కెను సద్భావశిష్ట కృతి స
మర్పణముసేతు దీనిఁకృతార్థత గన.

అమ్మ కమ్మని ఎదవిరి చిమ్ముతేనె
నాన్న విన్నాణముల వెల్గు వెన్నెలలను
గోలి రూపేపు గన్న నా కూర్మికూర్పు
సత్కృతిగ నిత్తు వారి కంజలి ఘటించి||

## <u>ఓం</u>

ఉ:

శ్రీల నొసంగ గన్ముదము సేమము గూర్పగ భవ్యమూర్తి వై
లాలిత సత్కళా లలిత లాస్యపు లీలల నోలలాడుచున్
మౌలిక శక్తి నిచ్చి "అహమస్మి" యనంగ గృతార్థు జేయగన్
జాలుదు నీవెవాణి! నినుజాలగ నమ్మితిసుమ్మి ! అమ్మరో! ||

శా:

నా నోటంబలి కించుచున్నయది తానా మాతయే, బ్రాహ్మియే,
జ్ఞా నానందమయా స్వరూపిణియె, ప్రజ్ఞావాప్య కల్యాణియే,
ధ్యా నాధాన రసత్సుధామధుర వాగ్ధారావతారమ్మునన్
నానా దోషహరా ప్రసన్నతను విన్నాణమ్ముతో జిమ్మెడిన్" ||

చం.

దినదిన వర్ధమానమగు తియ్యని సత్ కవితారసమ్ము గ్రో
లినని కవన్ని చప్పనయి లెక్కకుడొక్కకుఁ జిక్కకుండు, మే
లనగ భవత్కృతిప్రతిభ కందఱమందముదమ్మునంద మీ
వెనుక మిగిల్చి కొంతరుచిఁ బెట్టుట సత్కవులార మ్రొక్కెదన్||

## శ్రీకారము

1.సీ:

శ్రీ సదావాసమ్ము శ్రేయోవిలాసమ్ము
సత్కళానంద విశ్రామభూమి
ప్రేమస్రవంతికొద్దామ ప్రవాహమ్ము
సత్యవిజ్ఞాన విశ్వాసభూష
సంగీతసాహిత్య శృంగార భూమిక
మంగళకామ నారంగభూమి
ఆధ్యాత్మభావ నాద్యాపనాయతవేది
కరుణాద్రవాటిక కర్మపీఠి

2.తే:గీ:

ప్రధిత భరతమ్మ ఖండమ్ము భారతమ్ము
రత్న-నగరత్న- నగర –విరాజితమ్ము
నదనదీస్వాదు జలకలనాదముదిత
నవ నవోన్మేష సస్యపూర్ణమ్ము నహా!హా!. ( "వర్ణనా తీత మందొక వరపురమ్ము")

3.మ:
అది "లాహో"రటవారు " హిందు ముసిలిమ్మన్న"ప్రభేదమ్ములన్
యెదలో నెంచక "భాయి భాయి" యనియెన్నేనేండ్లుగానుండి రే
యదురంబోరును లేక నెయ్యమును వియ్యమ్మంది,యింపొంది, యా
పదలందొక్కరి కొక్కరాప్త గతి తోడ్పాటౌదురా నాటికిన్.
4.తే:గీ:
కడుపుగడపగ నచటనౌకరి లభింప
వలసపోయెను దూర ప్రవాసి యొకడు
అతని యర్ధాంగ లక్ష్మియే యగుట జేసి
తోడునీడగ భార్యతోడ్తోడ నేగె.
5.ఉ:
దూరపు దేశమేగి తమ దుఃఖసుఖమ్ములఁజూచు బంధు లె
వ్వారును లేనిచోట ఋజువర్తనులైయట వారిమైత్రితో
తీరిచినేర్చి కాపురపు దీపులనోపిన దీనదంపతుల్
వారలు నాకలమ్మునకు బందుగులిందును ముందుముందునన్.
6.తే:గీ:
దూరదేశాన "నా" యను వారలెవరు
లేక, "రెక్కాడ డొక్కాడు"లేమి బ్రతుకె
యైన, గష్టించి సంతృప్తమైనబతుకు-
బతుకుచుండిరి మనకథా బంధులచట.
7.మ:
ధన ధాన్యమ్ములు లేవు లేవను మనోదౌర్బల్యమేలేదు 'యిం
మ్మని' యాచింపక, కాయ కష్టమున సంపాదించి సంతృప్త జీ
వనమాధుర్యముగోలుచుండి, తమ దాంపత్యంబు 'నా ధర్మ మౌ
నను నట్లుండిరి వారలిర్వుర తులానందాంబుధిన్ దేలుచున్.

8.తే:గీ:

ఇట్టివారికిఁ గొన్నేండ్లు యేగెనచట
మిన్కుమినుకని లోలోన మెరయుచున్న
భవ్యదాంపత్య జీవన భవనమునకు
వెలుఁగునగు పాపకలుగు చిన్నెలును చూపె.

9.చం:

ఉచిత సపర్యలన్, మధువులొల్కెడి మాటల నాటపాటలన్
రుచికర భోజనమ్ముల వరుంబరితృప్తినిజేసి చెంత నా
సుచరితముచ్చటల్ గురియ జొక్కపులీలలదేలు నొక్క నా
డచలమనోనురాగమున నవ్విభుడామెనుజూచి యిట్లనున్.

10.కం:

దైవీగుణ సంపద నీ
కైవసమొనరించి సృష్టిఘనతను గాంచెన్
నీ వైననాడె పురుషుని
జీవితమున నొకవెలుంగు చెలగునుకల్కీ

11.శా:

కంటన్నీరునుఁ జంటిఁ బాలునొలకన్ గారుణ్యవాత్సల్యముల్
జంటన్ రూపునుగన్న భవ్యముభవజ్జన్మంబహో ! భామినీ !
పంటల్ భాగ్యములెన్నియున్న బురుషప్రాగల్భ్య మర్ధంబెన
ట్టింటన్ బచ్చగ మీరునిల్చు సిరియొండే నిండుసంపత్తులౌ.

12.కం

అనిపలికిన ప్రియపలుకుల
గొనముల దనమనమునందు గొనియాడుచుని
ట్లొనగూర్చుదీనబంధుని
వినుతించుచులేమ మురిసి విభుతోననియెన్.

13.తే:గీ:
మధుర హృదయులు,సౌమ్యులు,మంచిమాత్ర
మునె గ్రహించెడు సత్ప్రవర్తనులు మీరు
కాన మనబతుకానందకరముకాగఁ
గడచుచుండుట నిదియె భాగ్యమ్మునాకు.
14.
ఇటులనొండొరుల్ నైజ సంతృప్తి గలిగి
సంతతానంద కందళితాంతరంగు
లగుచు,జీవన మధురిమలాని యూని
కాలవాహినిలో కొంతకడచినంత.

పరివర్తనము

15.ఉ:
నిండుటెడెంద జీవనము నిచ్చలుధారలు వోసిపోసి యా
పండితరాణ్మహాత్ముల యపార కృషిన్ ఫలియించె సర్వతో
ద్దండుల చేతినుండి వెలిదప్పిన భారతభూమి, చెక్కలై
రెండుగ జేయఁనెంచి రొకరిద్దరు గద్దియదిద్దు బుద్ధితో.
16.తే:గీ:
'వేరువేరుగ దేశము విభజనమ్ము
సలుపవలె' నన్న తీర్మానములు చెలంగె
'హిందుముస్లిమ్' ప్రభేదమ్ము క్రందుకొనియె
భయదదుర్నీతి ప్రజలలోఁ బ్రబలజొచ్చె.
17.ఉ:
స్వార్థ పిశాచమూనుట విషాక్తమదాంధులు వైరవహ్నులన్
వ్యర్థముగారగిల్చి నరభస్మము సేయుదురంతెకాక యే
కార్థములై మహత్తర వికాసములౌ మతసూక్తులవ్వి య
త్యర్థకఠోరఘాతుక కదర్థములెట్లగు నేడు రేపునున్.

18.చం:

చిరుకెరటాలతో మధుర జీవనముల్ తెద తేరపార బం
ధురసుమనస్సమీర పరిధూత మనోహర కాలనిర్ఝరిన్
హరకృత మర్త్యమారణ మహావ్యవహార కరాళలీల భీ
కరమతవైర ముప్పెనలుగప్పెను ముప్పులగుప్పి చప్పునన్.

19.సీ:

తల్లులయొడుల పాల్దాగుపిల్లలజిమ్మి
చెండులవలె తలల్ జెండువారు
పీకలంబిసుకుచు బ్రేగులంబీకుచు
గుడ్రూడదీయుచు గుద్రుద్దువారు
నిండుచూలాండ్రను ఖండించి గర్భస్థ
పిండస్థితిన్ చూచుచుండువారు
మానభంగము కోడంబడని మానవతుల
బంధించిపశువృత్తి బరగువారు.

20.తే:గీ

రౌద్రబీభత్స మత్తకరాళరూప
ములను దాల్చిన యపమృత్యుముఖులువారు
మారణాయత్త యంత్రాలమాడ్కి కోరి
ఘోరవిధ్వంససల్పిరి కౄరులగుచు.

21.తే:గీ

అచటివారలు డెబ్బదియైదుపాళ్లు
తలుపుల నుబిగిం చి వెలికిరాకపోయె
ప్రాణములు పిడికిటబట్టి పగలురేలు
బతుకుచుండిరి జీవచ్ఛవంబులట్లు.

22.తే:గీ

ఆ మహా ఘోరముల గనులారగాంచు
వారికాహారనిద్రలు దూరమగుట
బెంగపడికృంగి యారోగ్యభంగమగుట
వింతయే ? వింత రోగాలు విస్తరిలుట!

23.కం:

తనపతి యారోగ్యము దిన
దినమునజెడిమిగులదుస్థితినిజూపగనా
వనితమ నమ్మున భీతిలి
యనెనాతనితో డ గనులయశ్రులు గ్రమ్మన్

24.శా:

మీయారోగ్యము నాయువున్ననది యే మోలెండు నాకేల? మీ
కాయాసమ్మగుచుండె నే దినము నీ కర్కోట కాలాహతిన్.
కాయోకూరయొ చాలు తిండికిది యే కష్టమ్ముగా నుండె. నే
రేయిన్ హా యన లేదు పో! క్షణము నిద్రింపంగ గన్మూసిరే!

27.ఉ:

చేయకి పట్టినంత పని జేయుచునుంటిని గాని యింతతో
సాయముచేయజాలుదునె! చాలదురెక్కలుముక్కలైన, లే
దాయెనుపాయమేదియును. దాపురమయ్యెను బీదకాపురా
'లో' యని యేడ్చు కాలమిది యోర్చుటయెట్లిది యీడ్చు టేగతిన్.

28.ఉ:

ఆ యెద నే విషాదనదమాగక సాగెనొ ? దోగి యశ్రువుల్
పాయలుగట్టి పారె తనపాలిన చక్కులమీద. లోననే
దో ! యది చెప్పలేనివెత దుర్భరమౌటను మేనువాల్చె నా
తో యజనేత్రినాధునవిదూర దయాహృదయమ్మునమ్ముచున్.

29.తే:గీ:

“బితుకుబతుకని” గుండెలు బెదురుచుండ
నిదర పట్టునె? ఐననో నిమిసమిట్టె
కన్నుమూసిరి. యింతలో గలకలమ్ము
పెమ్మకొనె నిండ్లుగాల్చిరి. దొమ్మిజరిగె.

30.మ:

మతవిద్వేష భయానకా ప్రళయ ఝంఝా న్మారుతోద్ధూతి నా
తతశాఖిల్ జనశాఖులాహత సముత్పాటమ్ము లంద్రెళ్లె. ను
ద్ధతవృక్షమ్ములపాటుచేనలుగు దత్ప్రాంతాల్పవృక్షమ్ము లీ
గతినస్మత్కృతి బంధుకుందగిలె నా ఘాతమ్మ పాయమ్ముగా.

31.కం

ఏ యన్యాయమెరుంగడ
మాయికుడావంత పొంతమాటలు తలపం
డాయనకు నిట్టియాపద
జేయగజేయాడె నెటులొ చెపుమా ! విధికిన్.

32.ఆ:వె:

వారియాత్మ తృప్తి వర్తనమ్మును వారి
దూరదృష్టి నైజ తుష్టి పుష్టి
దారిజూపు వారి పారస్పరిక ప్రేమ
యైనవిధియె వారికడ్డమయ్యె.

33.కం:

ఆదంపతులమనమ్ముల
మోదముహతమార్చెవిధియెముష్కరుడగుచున్,
ఏదేమియైననాయమ
ఖేదముగనె నెవరిగుండెకెలకదు కలతన్.

34.చం:
'కువకువ' యంచు రెక్కలవికుంచిత లీలల నప్పళించి, చం
చువులమరల్చియుత్సుకతజూపుచు బ్రేమకులంచమిచ్చు జ
క్కవకవయెవ్వియోకలలగాం చుచు లోకమెవిస్మృతించె తా
నవలనమర్చెబోయడొకయమ్మని యించుకయెంచబోయెనే?
35.శా:
ఏరీచెప్పగలట్టివారుభువిలోనేవేళకేమౌనొ? లో
కారాధ్యప్రతిభావిశిష్టుల ,జగత్కల్యాణసంధాయ కో
దారాచారుల(బుత్త్రులంగనినమాతల్ గూటికిం గుడ్డకుం
దూరమ్మైకడగండ్లపాలగుచుజేతుల్ చాచగా జూడమే?
36.ఉ:
తామొకమాతృగర్భమున దమ్ములు నన్నలు నౌచుబుట్టి ము
న్నామె సురక్షణమ్మునవెయన్నమునీరముగోలుచుండి, యం
దేమహితాత్ములున్ బ్రథితధీయుతులౌచునుగొందరుంట యం
దేమరికొందరుద్ధతులు, దీనులు హీనులు నౌట జూడమే?
37.కం:
కాలమొ! కర్మమొ ! ధర్మమొ!
చాలకమవ్వ్రప్రకృతియొ జనపతి కృతియో!
మేలునొ, కీడునొ ఎపుడే
వేళకు నొనరింపదెలియవలగునొక్కో?
38.తే:గీ:
చిచ్చుముట్టించి ముచ్చులురెచ్చగొట్ట
నిండ్లుకాలిన బిచ్చుకగూండ్లుకూడ
పాప! మా మధ్య మంటలోబడినయట్లు
గాయపడెనయ్యొ ! ఆప్రవాసియునునాడు.

39. సీసం.

కన్నీరు నిరతమ్ము గ్రమ్ము చుండునుగాని
పతిచెంతబలుకు నిబ్బరములొలుక
నేవేళకాతని కేమికావలయునో !
యని మంచమునువీడి చనదువెలికి
పతి యీ విపత్తును బాయుటెట్లను వగన్
మెదుకైనబెట్టదు మెలతనోట
"తనగతి ముందేమొ" ? యను నూహకు వెరచి
ధవునిబోవగ దేవతలనుదలచు.

40.తే:గీ:
నాయభాగ్యమె హేతువౌననుచుగుంగు
పాపకడుపున బడు వేళ పాపమేమొ?
యనుచుదపియించు మున్ బుట్టుయయ్యకొరకు
నెన్నిరీతుల నా సతి నేడ్చుదలచి
అనాధ

41.ఉ:
కలడొక వైద్యుడచ్చట నకారణసత్కరుణా ప్రపూర్ణుడు
జ్వలమతిజాతిపంక్తి మతసంతృకృతి భేదములెంచబోడు, దీ
నులకెలమిన్ సహాయపడు నొవ్వగ నెవ్వరి నాడబోడు తా
ఫలముపద ప్రతిష్టదలపండటు మానవజాతి సేవలన్.

42.ఉ:
ఆతడుభక్తుడౌను-కలహాసన భక్తి బదాలబాడుచున్
జేతలు లేని కూతలను సేవలొనర్పడు-దీన బాంధవ
ప్రీతియొనర్ప నిత్యముదపించును దూషితదీనదుఃఖిత
వ్రాతము సేవ జేయుచు గృపాపరుడై యొక కర్మయోగి యై.

43.మ:
అతడా ప్రాంతమునందు ఘోరతర హత్యాకృత్యముల్ మాన్పగా
యతనమ్మెంతయొ చేసెనార్పునె ? మధుస్యందమ్ము వానలో
ద్ధతినైనన్ విరమించ డాతని మహా త్యాగమ్ము నావిద్ధ పీ
డితులన్ వైద్య చికిత్ససేయ పరిపాటిన్ మించె లోకాదృతిన్.
44.కం:
తన భర్తకు నా వైద్యుని
మన దీన చికిత్సజేయు మని వేడగ స
న్మనమున చికిత్స జేసెను.
కనరావేమైనమేలుకల్గెడుచిన్నెల్.
45.క
తనశ క్తికొలం దిసాధ న
వెనుకాడకజేసెనరసివెజ్జడు కరుణన్
వెనుకా డెనాప్ర వాసుల
మునుపటి దౌర్భాగ్యమెల్లమోసముచేయన్.
46.కం:
ఇట్టుల రేయింబవలి
క్కట్టులకుందట్టుకొనుచుకలవన్నియు తా
కట్టిడి ఖర్చుల జేసెను
కట్టా! విధి యామె యెడలగట్టడియయ్యెన్.
47.తే:గీ:
గోలుగోలున నేడ్చును గొంతుకి గుర
నెత్తి నోరును మాటికి మొత్తుకొనును
అట్టెతలపోసిగాసిలి పట్టుదప్పి
కిందదబడి చితుకునొక బొమ్మఒలె

48.తే:గీ:
పసుపుగుంకుమతో గుర్రంకెభాగ్యరేఖ
గాజపూసలమోజులు కాలిపోయె
పూర్వభావాను బంధమ్ము పుటుకుమనియె
సర్వమున్ బోయె మిగిలెన సహ్యాపీడ.
49.తే:గీ:
అస్తమించెను భాగ్య ప్రభాకరుండు
చిమ్మ చీకట్లు గ్రమ్మెను జీవి తాన
కూర్రజాతులు నోర్విప్పి కొనెడివేళ
నీ ప్రయాణము సులువుగా నెట్లుసాగు?

51.కం
కనియా యనాధ యాపద
గనికారపు మనముకఱగి కనులనునీర్రై,
కొనకొనల జార వై ద్యుడు
తనయింటనె యామెనుంచదలచుచుబలికెన్.
52.ఉ:
సోదరి! నీదుదుస్థితినిజూచితినే , గనులార, లేరుగా ?
ఈదరి బంధులెవ్వరిక నే గతినుందువు ? తిందువేమి? మా
కేదియొ కొద్దిసాయమయి , యీ పయినుండుము మాదునింట నీ
కో దినమట్లనేకడచు కూడునుగుడ్డ కొఱంత లేకయే
53.తే:గీ:
ఇటుల నెన్నెన్నొ రీతుల నెలమిజాలి
కలిగి వైద్యుడు పలికిన పలుకులాత్మ
దలచి గత్యంతరము లేనిదగుట నామె
యొప్పుకొని వారి వారింట యుండనేగె||

54.ఉ:
లేరట యాత్మబంధువులు లెక్కకునెక్కడియున్ననక్కరన్
వారలు దూరదేశ మిటు వత్తురె? ఘోరము కాలమౌట నే
దారియు గానరాక తలదాచగ తీరిక చేరె నా మహో
దారుని యింటనుంట యుచితమ్మనియెంచియనాథ మీదటన్.
55.చ:
తనపతి ఎల్ల వేళల హృదంతరమందు వసింప బ్రేమకుం
గనబడు నా సురూపమున నారత మశ్రుల తర్పణమ్ము స
ల్పును బలివెట్టునామె పరిపూత చరిత్రము, నార్తలోక సే
వనము వ్రతమ్మొనర్చుచును పాసనజేయు బ్రియార్పితమ్ముగన్.
56.కం:
నెలగ డచెనొ ! లేదో ! ఆ
నెలత పయిన్ వెజ్జనాలినీచపుదృష్టిన్
తలబడి యనుమా నింపగ
గలతలు గృహమందుఁబుట్టెగలికి బొగులగన్.
57.కం:
చీటికి మాటికినేదో
మాటకు నా వెజ్జబోటిమగనినిదెగడున్,
మాటకు ననాథ నేదో
పో టులనగ్గించి వేచుపుట్టించుంనున్
58..ఆ:వె:
హద్దుమీరిపోయె నా లివెజ్జండేమి
చేయగలడు లోన జివుకుచుండె ,
ఎంతవారికైన నిల్లాలు చెడుదైన
గౌరవమ్మునీట గలిసిపోదె.

59. చం:

అదటి సుమంతలేక వినయమ్మునయమ్మునునిమ్ముసొమ్ము నై
ముదమును గూర్చువారునయి ముఖ్యులు నై పురుషుల్ చరించినన్
పదపడిభార్యదుశ్చరిత, ప్రాత్యయు, మూర్ఖ, యభాగ్యయైన నే
మొదవెడుకీర్తి వారలకు ? మూడెడుకీడును గోడుతోడుగా.

60. శా:

దారిద్ర్యమ్ము భరింపవచ్చు వెతలన్ దాటంగనౌవ్యాధినో
దారిన్ ద్రొన్పగవచ్చు, బ్రహ్మమునుసందానింపగావచ్చు,సా
చ్చారిత్రమ్ముగలట్టివారలకు లేశమ్మేనియిమ్మౌనె?యా
ఘోరకూర్రత రావమాన విషవత్కుంభీన సావాసముల్.

61. తే:గీ

ఎంతయో ? యోర్చెనాదీన యీయవజ్ఞ
గాని, తనమూలమున వెజ్జకలతబడుట
గాంచి యాయూరు విడిచిపోనెంచి యొక్క
రేయి తెగియించి యిలువిడిపోయెనయొయొ.

65. ఆ:వె:

శరణుగోరి దేశసంకటావస్థలో
బలురకములవారు పయనమైరి
ఇట్టి కాందిశీకు లెందరెందరో కల
రందుకలదు మనయనాథ యొకతె.

66. ఆ:వె:

ఊడిగంబు జేయనొప్పుతప్పనబోదు
చేయిచాచియడుగ హేయమగును,
కూలినాలి చేసి కాలమ్ము గడుపును
అలసిపోవునొంట బలము లేక.

67. ఆ:వె:
కొన్నినాళ్ళుగడపె కూలినాలిని( జేసి
యూడిగమ్ము( జేసి యొకవిధాన,
అంతగర్భ భారమధికమౌటంజేసి
అడిగికొనుట తప్పదయ్యెనింక.

68. ఆ:వె:
అడిగికొంచుగొన్ని యాత్రలుసాగించె
కడుపుకింతకూడుకట్టగుడ్డ
కరువెయయ్యె నామె గర్భమ్ముబరువయ్యె
రూపు మారె పోల్చనోపరెవరు.

భిక్షుకి

69.ఉ:
పూతచరిత్రమై నిఖిలభూషణమై నిజదేశసంపదు
ద్భూతికిహేతువై కళకుదోహదమై మహితప్రభావమై
ఖ్యాతినిగన్నదయ్య తమకాంతుల(బాసిన కామినీమణి
వ్రాతము చిచ్చు జొచ్చునటు వ్రచ్చును మచ్చును మాయలేకయే.

70.శా:
ఆ నిర్నిద్రదరిద్రతాద్రవ మహాహైన్యమ్మునన్మగ్ని యా
దీనాస్వాంత, కఠోర గర్భధృతికెంతేనంత చింతింపదో!
ఆ నైరాశ్యతమస్తమస్వినుల బాహావ్యాప్తినాలుప్తమై
లేనేలేదొక లేతవెన్నెల మెయిన్ లేబ్రాయమున్నేయమౌ.

71.ఉ:
చింపిరి గుడ్డకట్టుటది చింతలబొంతలకుట్టు మేనిపై
బింపిరి పట్టుబట్టలవి పేదలబాధల కాటపట్టు ని
మ్నంపు నిరాశ దృష్టులవి మానవసృష్టికి నష్టవృష్టులే
కొంపనొ ముష్టికైయడిగి కోనదిదేశము గోల వెట్టుటే.

72.చం:
ప్రణయతరంగ డోలికలపై మధురమ్మునగాధ మైన జీ
వనపదమందు మోదమొదవన్ బయనించిన యా విలాసనౌ
కను నిటులోతుఫాను పెనుగడ్డయియడ్డుట మున్గుచుండె నెం
దునుదరి జేరునే ? సుడినధోగతిఁబట్టి మునంగకుండునే ?

73.చం
ఇదియొక సిద్ధహస్తుడగు నీశ్వరశిల్పి యనల్పకల్ప నా
భ్యుదయము జూపి మానవ విభూతిని లోతునెరంగి నేర్పుతో
పొదిపిన ప్రేమమందిరమపూర్ణమునై శిధిలావశేషమై
తుదఁగనుచుండెనిట్లు పరిధూతధరావివరాంతరాప్తయై.

74.చం:
మొలకలదోసిమోసలకు ముచ్చట రేకులమూసి లేగొనల్
మెలికలువాసి పూత కెలమిం దలపెట్టిన తీవయిద్ది , జా
బిలిచలువన్ వలంచి తొలిబెట్టిన యీకళికమ్మునింక నీ
వలగనరాదు వ్రేటుపడె వాడుటమాడుట గూడ చూడమే.

75.చం
కరిగిన గుండెలో, మరిగికారిన భాష్పపు ధారతో నదే
కరుణరసమ్ము జిమ్మునొకగాజు కలమ్మునుచేత బట్టి యే
బరువు భరింపలేని అతిభావుకుడే కవిరాసి పెట్టెనో?
చెరగుచునున్నదీ కవితజీర్ణములై విడిపోవవర్ణముల్.

76.చం:
ముడియిడలేదు జట్టునటుముంగురులన్ ఎగబెట్టబోదుముం
దడుగిడలేదు, నోరుతడియారిన నూరటలేదు గోడునన్
తుడవగలేదు చెమ్మటలు తూలుచుదూలుచుబోవుదీన యే
గడపనొకూర్చొనున్క్షణము, గర్భభరమ్మతిదుర్భరమ్ముగాన్.

77.తే:గీ:

అదినిదా ఘోగ్రకీలా విహారవేళ
అంటుకొను భూమినడుగిడ మంటలెగసి
ఉగ్రనిశ్వాసముల నించుచుండె ప్రకృతి
కాని యాకలిమంట యద్దానిమించ.

78.తే:గీ:

అర్ధనగ్నతనుం ద్విగ్నయై కఠోర
గర్భభారమ్ము దౌర్భాగ్య ఘుట భరమ్ము
అణచివేయగ నడుగులోనడుగు నిడుచు
నొడలుతడియగ జెమ్మటలూరిపార.

79.తే:గీ:

కండ్లు పొగరులుగ్రమ్మ గద్గదముగదుర
'అమ్మ ! అమ్మయ్య' యనుచు నే గుమ్మమునకొ
దీనభిక్షుకి చనునదే దేవురించి
శూన్యభిక్షాకపాలమ్ము జూచుకొనుచు .

80.ఉ:

ఆ కనుదోయిలో(దొళుకు నశ్రులు క్షుబ్ధహృదంతరా వ్యధా
భీకర దావకీలలదపించి ద్రవించి స్రవించి యా విరుల్
పైకొనుతేనె తెమ్మరులు భగ్నవిలగ్న మనోరధమ్ములే
గాక పదేపదే యుడుకుగమ్మిన నిశ్వసనమ్ము జిమ్మునే.

81.ఉ:

నిండదు భాగ్నపాత్రమిది, నింపుతలంపునులేదు, ఎవ్వరో
గుండెకలట్టువారు తనకో కబళమ్మునుబెట్టనుందురం
చెండినయాస నూతగొని యేగుచునున్నది దీనురాలు ,తో
డెండిన యాకురాలి సుడులెత్తిన గాడ్పున ముక్కలై చనన్.

82.ఉ:

‘పక్కున’ నవ్వదే ! విరగ బాటున చేటుకు లోకమెక్కిళుల్
బెక్కులువచ్చుదాక పరపీడన క్రీడనకాగ జూడదే!
కక్కుల కళ్ళమై నియతి , కాలము గాలము గాగ తిండికిన్
గక్కురితై యెదల్ జివికి కాలినవారికి లేరు బంధుగుల్.

84.ఉ:

ఆకలిమంటమీద నపహాస్య మవజ్ఞయునింధనమ్ములై
సాకగమున్నె వ్రేల్చబడిచచ్చె మనమ్మభిమానమైన నీ
లోకపుదీపియేది తనలోకలదో! అతి దుర్భరమ్ము ని
త్యాకులమైన జీవనము త్యాగముసేయదలంచదయ్యయో!

ఉ

85.“మైనముకాదుమీకడుపుమంటలకుంకరుగంగపాకు బా
రేనలరాతిగుండెలవి,రిత్తగబోవునెమీయుసుర్ల ఘూ
టైనను,నూర్పువేడిపొగరైననుతాకదె ?ప్రేలిపోవెరే
పైననుచెక్కచెక్కలయిపాటునకట్టడియందుపొందవే!”

86.తే:గీ:

“అరయ దుఃఖాంతమైన యే కాంకియిద్ది
చివరదీ దృశ్యమును ప్రదర్శించుచుండె
సూత్రధారియు, నేర్పరి, పాత్ర ముచిత
మైనసామాజికులు హృద్విహీనులగుట
తద్రసానుభవమ్ము సుంతైనలేదు”

87.తే:గీ:

చండమార్తండ భీకర జ్వాలనమును
దట్టుకొనలేక ఒకనీడపట్టు జేర
దీనభారముగనడుగడుగునిడుచుచు
నామెయొకయింటి యరుగుపై నడుగు బెట్టె.

88.కం:

"అమ్మా! కుత్తుక తడిలే
దమ్మా! నీళ్ళీయవమ్మ !దాహము తల్లీ!
నిమ్మళ ములేదు నిలబడ
గ్రమ్మును జీకట్ల"టంచుగాలిసి యడిగెన్.

89.ఉ:

"కూటికిగుడ్డకున్వెదకికొంచు శ్రమించుచువిశ్రమించ నో
గూటెనిచోటులేక తమగోడులెతోడయి చెట్టునీడ నా
నాటికిగాలమున్గడపు నగ్నదరిద్రులభగ్నముద్రలన్
నూటెనిఁగోటిచేసిన యనూనధనాంధులు గాననేర్తురే?"

91.తే:గీ:

' భుక్కుభుక్కు' ని యరచుచుఁగుక్కయురికె
పక్క హేమక్కులోపాప 'బావురన ' చ
'టుక్కుమని' లేచె శ్రీమతి ప్రక్కనుండి
చెక్కుకొని పోయెఁదల, రౌద్ర మెక్కెభామ !

92.తే:గీ:

"ఎవతవే! దయ్యమా! గడపెందుకెక్కి
నావె, 'ఫో''పోవె' పింజారి లేవవేమె?
ఓసి రాస్కెల! బద్మాష! ఒసలవేమె?"
అనుచుగోపించి కారులనరచె భామ.

93.తే:గీ:

"అమ్మ! దయలేద? నిండుచూలాలినమ్మ!
దాహమగునమ్మ కుత్తుకతడియిగిర్చె"
ననుచు బ్రతిమాలు నా యభాగినిని బట్టి
తిట్టికొట్టగ జేగట్టి బట్టె భామ.

94.తే:గీ:
ఉక్కచే నిద్రపట్టక యుబుసుపోవ
ధూమపానమ్ముసేయుచుదూగుకుర్చి
పైనపత్రికజదువుచుబండుకొన్న
నాగరికుడైన ఆయింటి భోగియపుడు.
95.తే:గీ:
విసిగి కోపించివచ్చెను వెలికి నులికి
అన్నిరీ తులదన నిజసఖినె ననుస
రించుచుండుట యే వ్రతమంచు నెంచె,
అందుకొ నెకర్ర దీనపై నాచివిసరె.
96.తే:గీ:
ఆ మదాంధుడు గనుటెటు లామెదశను?
ఉచితరీతిని బోవగనోపుటెట్లు?
వెలితిగుండెకు లోకము తెలియటెట్లు
ఇందుముందున నేమౌనొ? ఎరుఁగుటెట్లు?
103.తే:గీ:
ఛీ – చి ! యీ నిష్ఠురుల దలంచినయఘమ్ము
వరలు మీరలె పాపాల భైరవులన
ఈ కసాయిల యూసులింకెత్తరాదు
ఆ యనాధకు కాగలదంతయయ్యె.
104.తే:గీ:
వెనుక నా తుచ్ఛభోగికి వేనవేలు
ఖర్చులైనను శిక్షలు ఖైదులైన
దీన బ్రతుకునె? దుఃఖమ్ముతీరునొక్కొ?
ఆమెకథయింక దుఃఖాంతమౌను దల ప.

105.ఉ:

లోకపుమాటపోటు పతిలోపము లే వడి రాటుచేటుగా
ప్రాకుక్షుధా పిపాసలను పాములకాటును తోడులోటు నా
పాకభరోదరమ్మదిరిపాటును వ్రేటునగల్గిగాయమున్
సోకి హఠాత్ప్రసూతియగు సూచనలయ్యెను బోటికక్కటా!

106.తే:గీ:

దయయు స్త్రీత్వాభిమానమ్ము ధర్మరతియు
పెనగికొనజూచి యీ దీనవనితగతిని
అచట లేమలు సంభ్రమాయత్తలగుచు
నెట్టులెట్టుల్లో చాటునుబెట్టిరిట్టె.

107.తే:గీ:

వలయు నుపచారముల జేయ వనితలెల్ల
తెప్పరిల్లుచు నా దీన తెరచి కనుల
బెసవమగుట గుర్తించి భయమున నేడ్చు
నొడుకుచేతుల మునుజూచె బుడుత దడవ.

108.ఉ:

కాకులమూకలై పదునుకాచిన మేకులుబాకులౌచు నే
కాకిగజేసి లోకులటు కారులగూయుచుగోరలాని చి
కాకునుబెట్ట నోర్చుకొనె గాఢదరిద్రము ముద్రగొట్ట ని
క్కాకను సుక్కి నీ శిశువుగల్గెడునన్ గలగాంచికాదొకో!

109.సీ:
చిదిమిన బాల్ గారు చిన్నారి వయసులో
పిల్లబొమ్మల నొడిబెట్టునమ్మ
ముద్దులొల్కెడు లేతమొలక ప్రాయమ్మున
పిన్నపాపల జంకబెట్టు తల్లి
తరుణియై రేబవల్ తాగన్న కడుపుకై
తీపికలల గాంచు దివ్యమాత
'వంశకర్త యగుచు వర్ధిల్లు మాబాబు'
అనుచు బౌత్రుల యూహ దనియుజనని.

110.తే:గే
మధురనిస్వార్ధ ప్రేమసామ్రాజ్య భద్ర
పీఠిపై మంగళస్నాన ప్రీతితోడ
తనువు, మనసును, పని , యేకతను నమర్చి
బలియొనర్చెడు మాత సంబరము పడదె?
(ఎట్టికష్టమ్మునను పుట్టు పట్టి కొరకు)
111.చం:
పులకితయైన పృధ్వి యరపూచిన పూవుల తేనెవెన్నెలన్
గలకలనాడు వేకువవికాస విభూషితయౌనుషస్సు తో
ల్దొలుత సువర్ణరేఖలనుదోచెడి తూరుపు కైత నేరుపై
యలరెడు తల్లిప్రేమ నరయన్ గలవారలె ధన్యులీధరన్.

112.సీ:

స్వార్థరహితము నీర్ష్య విరహితమ్మునై
మమతామహత్వ మీఅమ్మ ప్రేమ
శుభ కామనామేయ శోభాసమేతమై
తత్వసుందరము నీ తల్లిపేమ
హేయనిష్కాసమ హింసావికాసమ్ము
జ్ఞానోదయమ్ము నీజనని ప్రేమ
ధర్మ కవచముగా నిర్మలకర్మల
నెమ్మిరక్షణ జేయునమ్మ ప్రేమ.

113.తే:గీ:

త్యాగసద్యోగ సాధనోద్యోగ భాగ్య
మనుపమానంత వాత్సల్య భరితచరిత
మమృతమున్ వాగగోచర మచ్చమైన
మాతృప్రేమయె భువి పరమాత్మయనగ

114.శా:

ఆ మాతృత్వ పవిత్ర భావనలు బాల్యావస్థలో నాటలన్
లే మొల్కై, ప్రథమార్తవమ్మున(జివుళ్ళైపూవులంనూచుచున్
సీ మంతోత్సవవేళకున్ మధురసోత్సేకమ్మునన్ బిందెలై
యేమూడారుననో ఫలించిరసమెంతే( జిల్కుసుస్తన్యమై.

115.మ:

హైందవ సుందరీమణుల యందు గలట్టి పవిత్ర సంస్కృతుల్
గ్రందుచుమాతృధర్మము వికాసము పొందిననాడె, నాడెయా
నందము లేమకుం దన సమాజమునన్ ప్రతిపత్తినాడె, స్వ
చ్ఛందతనాడె జీవితపు జాలున జాగృతి సార్ధకత్వమున్ .

116.కం:

కనిపెం చినత ల్లుల కుం
గనికారముమెండుకష్టకాలములందున్
తనవా రిమించి యుపకృతి
వెనుదీయకజేతురెట్టివెలదికినైనన్.

117.తే:గీ:

ఎందరో! చేరిరందును ముందు నడుము
కట్టి యా దీనయుపచార కార్యములను,
శ్రద్ధగా జేయుచుండెను శాంతయనెడు
కాంత పేరుకు దగినది కరుణగలది.

118.చ:

కరువతిఘోరమౌట దమకాయముదక్కువయౌట భర్తకున్
బరువగునట్లుగాక సదుపాయముతో బొదుపైనరీతి నిన్
ల్లరసియొకింత తీరికను పొల్లునుసేయదు కాలమామె, త
న్నిరుగుపొరుంగు మెచ్చుకొననింతుల కెంతయుమేలుబంతియే.

119.కం

గంపెడు పిల్లలు కలదియు
నింపైన మనమ్మ కలదినేర్పైనదియున్
సొంపైన గొనముకలదని ,
ఎంపుడుగాజెప్పుకొందురెందును నామెన్.

120.ఉ:

ప్రక్కనెయున్నయామెగని పల్కెనభాగ్య నవ ప్రసూత ము
న్నొక్క నిమేష మాత్రము కనుంగొనెపాపనుపాప !మంతలో
బిక్క మొగంబువైచి నిరుపేద మనంబున నేమితోచెనో !
చెక్కులనీరుజార తనచేతినిఆయమచేతియందిడే.

121.తే:గీ:

"అక్క"! మాటాడజాల నాయాసమగును
పెంచిపెద్దగజేయు మీ బిడ్డనది
దయతలంచుము తప్పుగాదలవకమ్మ
'అమ్మ'యని పిల్వ నీవెనేనగుచు విందు.

122.తే:గీ

నపుడె:శాంతించు నాయాత్మననుచు నమ్ము
మక్క ! 'ఒకమాట' ఈ లేఖనందుకొమ్ము
భద్రముగనుంచి బాబుకుబ్రాజ్ఞతగని,
ఇమ్ము ఇద్దియె నే దాచి యిడినసొమ్ము.

123.తే:గీ:

అనుచు నందిచ్చి యాయాస మధికమౌట
కనులమూసెను దీనాత్మతనువుబాసె,
పత్రమున్ బిడ్డనందెను భద్రమహిళ
కరుణయుప్పొంగగన్నీరుగార్చిరంత.

## సందేశము

124.తే:గీ

కాగితముఁజూడనుత్కంఠ కలుగనంత
జదివె నా చాన కన్నీటు జాలుతుడిచి
పుట్టబోయెడు పాపసంబోధనమున
నా యభాగ్య స్వసందేశ మాలిఖించె.

125.ఉ:
మాత ఋణమ్ము దీర్చు కొనుమా ! కనుమానిజమానుషత్వ మే
రీతిని పూతమౌనొ, విపరీతమతమ్ములనమ్మఁబోకుమా
చేతల నీతిరాతల వి శేషతఁజూపుము మర్త్యజాతికిన్
జేతన యొప్పగా నమరజీవివి కావలె నీవు పుత్రకా!
126.ఉ:
జాతిమతాది మార్గములు సంకుచితమ్ములు పంకకంట కో
పేతములట్టుఁజేసి యవివేకులు ముచ్చులు విశ్వసౌహృదా
ఘాతమొనర్చు చిండరిక కావలె భావివిశాలమార్గముల్
ఆతలపుల్ నెలార్చుము నయానునయమ్ముల నీవు పుత్రకా!
127.ఉ:
మూతలుపడ్డవై మురిగిముక్కుచునున్నవి మూలసూత్రముల్
తాతలఁగోతులట్లరసి తాముతలన్ దలబెద్దలైరి, ఏ
కూతలొరాతలై వెలయ కూటికిగూటికి వాచిరెందరో!
నీతిబలమ్ము కావలయునిప్పుడు నీ వదికూర్చు పుత్రకా!
128.ఉ:
ఈతకులోతుకల్గునె? సహిష్ణుతకున్ బరువేది? దీక్షకున్
బ్రాతయు గ్రొత్తలేదు, ప్రతిభాయుతుడొక్కడెచాలువిశ్వవి
ఖ్యాతిగ సర్వమానవ సుఖంకరుడై చనునగ్ర గామియై
ఆతని వెన్కనన్నియు దమంతటవచ్చును నమ్ము పుత్రకా!
129.ఉ:
భూతదయా పరత్వమతి భోగవిరక్తి యు విశ్వసౌహృద
స్ఫీతియు గల్గి దుర్మధనపీడిత జాతులనుద్ధరింపుమా!
మూతి బిగుంపులన్ వెదకి మున్మనుకన్నులవిప్పఁజెప్పుమా
రాతిరి బేరగాండ్రదరి రాలజఁరింపుము నీవు పుత్రకా!

130.చం:

చదువధికారమున్ గులము, సంపదలియ్యవి దుష్టబుద్ధులన్
మద మొదవించు, వారికి గనంబడరార్తులు, ధూర్తవృత్తి నా
పదలు ఘటింత్రు లోకమున వారలెవారికి లొంగకుండి నీ
హృదయముదిద్దుకొమ్మవల హీనమనస్కులదిద్దు పుత్రకా!

131శా:

సంసారమ్మిదిదుఃఖసౌఖ్యములశశ్వద్భ్రాంతియీభ్రాంతిచే
హింసాహింస పథమ్ములేర్పడు, కృతమ్మేశక్తి యో! ధర్మ వి
ధ్వంసాయుత్తుల హింసనేగుదురు సత్యాహింసనేత్రీవ, 'సో
హంసోహమ్మని' దీనబంధులు ప్రయాణాయత్తులౌపుత్రకా!

132.తే:గీ:

గాంగ నిర్ఝర రంగత్తరంగ గతిని
భువనమోహన నవవేణు రవళిసరణి
పేమవిశ్వాసముల మేళవింపుమిద్ది,
సర్వమంగళ మాంగళ్య సంగ్రహమ్ము.

- సమాప్తం-